# నన్ను హత్యా చెయ్యావూ?

అన్యోన్యానికి మారుపేరులా, అనురాగానికి ప్రతిబింబంలా ఉన్న నీరజా కోమలలు మధ్య ఒకనాడు రామకృష్ణ హఠాత్తుగా వచ్చిపడటంతో ఈ కథ ప్రారంభ మవుతుంది.

కారు హారను వినీ వినగానే అక్కకోసం ఆత్రుతతో పరుగెట్టిన నీరజకు అక్కతోపాటు మరొక యువకుడు కూడా దిగటం ఆశ్చర్యం కలిగించింది.

అందరూ విశ్రాంతిగా కాఫీ ఫలహారాలు తీసికొంటున్న సమయములో నీరజకు అతడి పూర్తి పరిచయం లభించింది.

"నీరజా! నీకో విషయం చెప్పాలి"—అంటూ మొదలు పెట్టింది కోమలి. కోమలి ఎప్పుడూ ఇంతే! ఏ విషయమైనా దొంకెతిరుగుడుగానే మాట్లాడుతుంది. నీరజ ఆశ్చర్యంగా కనులు పైకెత్తి అక్కవంక చూసింది.

"ఈ రామకృష్ణగారూ, నేనూ కలిసి చదువుతున్నాం. ఈయన ఆర్థిక పరిస్థితులు బాగులేక చదువు ఆపేద్దా మనుకుంటూంటే ఖర్చులన్నీ నేనే భరిస్తానని పట్టుబట్టి నేను మెడిసిన్‌లో జేర్పించాను. మనది ఉమ్మడి ఆస్తికదా! నీకు తెలియకుండా ఇలా నేను..."

నీరజ మధ్యలోనే కిసుక్కుమంది.

"ఇంత పెద్దదానివయినా, నీకు ఎక్కడ ఎల్లా మాట్లాడాలో తెలియ దక్కయ్యా! నన్ను బాధపెట్టాలని కాకపోతే ఏమిటీ మాటలు చెప్పు?" అంది బాధగా.

కోమలి నవ్వుతూ "నీ మనసు నాకు తెలుసు, అయినా—" అని ఏదో అనబోతూంటే నీరజ, "అబ్బ! ఊరుకో!''అని కృత్రిమ కోపంతో కసిరింది.

అనుకోకుండా నీరజ చూపులు రామకృష్ణమీద పడ్డాయి. అతని ముఖం ఎర్రగా కందిపోయింది. నీరజ లోలోపల జాలిపడి తేలికగా నవ్వుతూ, "కాఫీ తీసికోండి బావగారూ! తర్వాత కొత్తవారిలా సిగ్గు పడుదురుగాని''—అంది.

కోమలీ నీరజల సంభాషణ వల్ల కలకబారిన అతని హృదయాన్ని నీరజ మాటలు కొంత ఊరడించాయి.

కృతజ్ఞతతో నీరజవంక చూసి కాఫీ తాగటం మొదలుపెట్టాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచాక రామకృష్ణ. "ఈ పక్షపాతం పనికిరాదు. నాకు మీచెల్లెలి పరిచయం కాలేదు" అన్నాడు. కోమలి సిగ్గు పడి, "అవును. మరిచిపోయాను. ఇది నా చెల్లెలు నీరజ. నీరజలాగే స్వచ్ఛమైనది. తనకిష్టమైనవి చదవటంకోసం బళ్లోవాళ్ళు చెప్పినవి చదవడం మానేసింది. రాత్రింబగళ్ళు ఏమిటేమిటో పనికిరానివన్నీ చదువుతూనే వుంటుంది" అని నవ్వి, అంతలోనే దిగులుగా, "దాని దుర దృష్టం! పుట్టినప్పుడే ఒక్కచేతితో పుట్టింది. ఆ లోటు తీర్చలేను"— అంది.

రామకృష్ణ ఉలికి పడ్డారు. ఆమెకు ఒక చెయ్యి లేదనేవిషయాన్ని అతను గుర్తించలేదు. ఆశ్చర్యంతోనూ, జాలితోనూ ఆమె ముఖంలోకి చూశాడు. నీరజ చాలా సిగ్గుపడింది. కొద్దిగా బాధపడింది. పైకి హుషారుగా నవ్వేస్తూ "అక్కయ్యా! నువ్వుండగా నాకు చెయ్యిలేక పోయినా, రెండుచేతులూ కాళ్లూ లేకపోయినా, ఏం ఫరవాలేదు'' అంది. రామకృష్ణ వింతగా మెరుస్తున్న ఆమె కళ్ళల్లోకి చూశాడు. ఆ కళ్ళలో దిగులు లేదు. ప్రగాఢమైన ఆత్మ విశ్వాసం మాత్రమే కన్పిస్తూంది.

* * * *

కొబ్బరితోటను ఆనుకుని ప్రవహిస్తుంది చిన్న ఏరు. దాన్ని ఏరు అనటం కంటే పంటకాలువ అంటేనే నయం. దాని వెడల్పు లోతు కూడా చాలా తక్కువ. ఆ ఏటిగట్టంతా చాలావరకు బురదగానే ఉంటుంది. ఒకచోట మాత్రం శుభ్రమైన రేవుంది. దాన్ని నీరజే కట్టించింది. రోజూ సాయంత్రం వచ్చి ఆ గట్టుమీద కాసేపు కూర్చుని పోవటం నీరజకు అలవాటు.

ఆనాడు కూడా అలానే పంటచేలు ఒకదానితో ఒకటి యుగ యుగాలనాటి ప్రణయగాథలు గుసగుసలు చెప్పుకుంటూంటే వింటూ కూర్చుంది.

"నా కడుపులో ఎన్నో విషాదగాథలు దాచుకున్నాను. నా గుండె కరిగిపోతూంది. కాస్త వినవూ?'' అని ఏరు గలగలా ఏడుస్తూంటే జాలిగా నవ్వుకుంది.

"అచ్చం కవులు వర్ణించిన వన కన్యలా ఉన్నావు" అన్న రామకృష్ణ మాటలకు ఉలికిపడి తన ఊహా లోకంనుండి ఈ లోకంలోకి

వచ్చిన నీరజ మొదట చాలా సిగ్గుపడింది. తర్వాత ఆశ్చర్య పడింది, తన అక్కతోపాటు గుడివాడగానీ. కైకలూరుగానీ కారులో వెళ్ళనందుకు. అదే అడిగింది.

"నేను చదువుకోవల్సింది ఉంది. అందుకని తనతో వెళ్ళలేదు—" అని క్షణకాలమాగి, "మీ అక్కయ్య 'పుస్తకాల పురుగు'నని నన్ను వెక్కిరిస్తుంది. కానీ నువ్వేచెప్పు. బీదవాడిని నేను శ్రద్ధగా చదువు కోకపోతే ఎలా?" అన్నాడు.

ఈ మాటలకు నీరజ నొచ్చుకుంది.

అర్థం లేకుండా మాట్లాడుతున్నారు మీరు! మా బావగారు బీద వారంటే ఒప్పుకోను'' అంది.

రామకృష్ణ నవ్వాడు. ఆ నవ్వులో హుషారులేదు. ఏదో దిగులూ వెలితీ కనిపించాయి. నీరజకు అర్థం కాలేదు. తాను ఊహించినదంతా నిజం కాదేమోనని అనుమానంకూడా వచ్చింది.

"రండి బావగారూ! అక్కయ్యతో ఏలానూ వెళ్ళలేదు. మీకు పొలాలయినా చూపిస్తాను'' అంటూ లేచింది. రామకృష్ణ ఆమెవెంట బయలుదేరాడు. ఇద్దరూ ముందు కొబ్బరితోటకు వెళ్ళి అక్కడ లేత కొబ్బరి బొండాలను కొట్టించుకొని నీళ్లుతాగి ముందుకు సాగారు.

పొలంలో ఒకచోట గలాభా జరుగుతూంది, నలుగురుపాలేళ్లు బాగా త్రాగి ఇష్టంవచ్చినట్లు నోట అనరాని వాగ్బాణాలు విసురు కుంటు న్నారు. వాళ్ళను చూడగానే రామకృష్ణకు భయమయింది. చటుక్కున నీరజ చెయ్యిపట్టుకుని ఆపి, "ముందుకు వెళ్ళవద్దు'' అన్నాడు. నీరజ చెయ్యి విదిలించుకొని చరచర ముందుకు వెళ్లింది. నీరజను చూసి

చూడగానే ఆపాలేళ్ళకు తాగుడుమైకం ఎక్కడిదక్కడే వదిలిపోయింది. నలుగురూ వణుకుతూ చేతులు జోడించి, నీరజ ఏమీ అడగకుండానే—
"ఇయేలకి తప్పుకాయం దమ్మగోరూ! సంబరంలో వుసారొచ్చి ఓ సుక్కేసుగున్నాం. ఇంకో తేప ముట్టుకుంటే మీ పాదాలసాచ్చి" అంటూ నీరజ పాదాలు పట్టుకోబోయారు. నీరజ వెనక్కుతగ్గి కోపంగా "చాల్చాలు! మీ ఒట్లూ ప్రమాణాలూ! ఎన్నిసార్లు ఇలా? ఈ త్రాగుడు మీ ఒళ్లూ ఇల్లూ గుల్లచేస్తున్నా మీకు బుద్ధిలేదు. ఇంకోసారి ఇలా నాకు కనపడితే మాత్రం క్షమించేదిలేదు. ఇక నా దగ్గర ఉంచుకోను" అంది. నలుగురూ మళ్లి లెంపలేసుకున్నారు

నీరజ రామకృష్ణతో ముందుకు నడిచింది. వాళ్ళలో ఒకడు మాత్రం నీరజ వెనకాలే నడుస్తూ వచ్చాడు. నీరజ వెనక్కు తిరిగి, "ఏమిటిరా మల్లయ్యా!" అంది. వాడు చేతులు నలుపుకుంటూ "చంటి దానికి జొరం మొచ్చిందమ్మాయిగోరూ! డాకటేరుకాడికి పోవాల! ఇంటి కాడ—" అంటూ గొణిగాడు. నీరజ తన చేతిరుమాలులోనుంచి పది రూపాయల కాగితం తీసి వాడికిస్తూ, "వెధవా! ఇంకాస్త త్రాగు. ఇంకెక్కడా వాగకు. రేపు మీ యింటికి చంటిదాన్ని చూడడానికి వస్తా. నీ మాటలు అబద్ధమని తెలిసిందా!—"అని వాడివైపు తర్జని చూపింది. వాడు పదిరూపాయలు తనచేతికి వచ్చిన సంతోషంలో తల ముక్కలవుతూ. "సత్తె పెమానం తల్లీ" అంటూ తనదారిన పోయాడు. రామకృష్ణ విచిత్రంగా నీరజవంక చూశాడు. ఇదివరకు తోచలేదు కానీ, చామన ఛాయగా ఉన్న నీరజ కళ్ళలో ఏదో అపూర్వమైన ఆకర్షణశక్తి ఉన్నదని తోచింది రామకృష్ణకు. ఆమె విశిష్ట వ్యక్తిత్వంలోని ఒకభాగాన్ని ఈనాడు తాను కళ్ళారా చూడగలిగాడు. నీరజ తాను అనుకున్నంత సామాన్యురాలు కాదని అర్థమైంది అతనికి.

ఇంటికి వచ్చేసరికి కోమలి అప్పుడే వచ్చిఉంది. "ఏం, రామకృష్ణా, నీకు మా పల్లెటూరు బాగా నచ్చినట్లుందే!" అంది.

"అవును కోమలీ! పట్టణాల్లో ఉండి ఉండి విసుగెత్తింది. ఇక్కడికొచ్చీకూడా కాస్త హాయిగా గాలి పీల్చుకోకపోవటమేం ? అనుకున్నాను" అన్నాడు రామకృష్ణ. కోమలి నవ్వేసి వెళ్ళిపోయింది.

ఆ మొదటిరోజు కోమలికంత బాధ అనిపించలేదుగానీ, ఆ తరువాత రామకృష్ణ తనతో రాకుండా చెల్లెలితో పొలాలకేసి వెళ్ళుతూంటే చాలా కష్టమనిపించింది. మనసేదో కెలికినట్లయింది.

అసలు రామకృష్ణ మొదటినుంచీ అదొక తరహావాడు. తనకెంతో దగ్గరలో ఉంటూకూడా చాల దూరంగా ఉన్నట్లే ఉంటాడు. తనదగ్గర ఆర్థిక సహాయం అంగీకరించడాని కెంత గొడవ చేశాడూ! అతనిచేత 'ఊఁ' అనిపించేటప్పటికి తాతలు దిగివచ్చారు!

కొంపదీసి అతనికి తనమీద ప్రేమ లేదేమో ? ఈ అనుమానానికి కోమలి వణికింది. నిలువుటద్దంలో తనను చూచుకుంది. మేలిమిబంగారు ఛాయలో ఉన్న అందాల ప్రతిబింబాన్ని చూచుకుని మురిసిపోయింది.

చామనఛాయలో ఒంటిచేతితో ఉన్న నీరజ తనను ఓడించగలదా ?

ఒంటిచెయ్యి! ఒంటిచెయ్యి! ఒంటిచెయ్యి!!

నీరజ మంచిది! నీరజ చురుకైనది! నీరజ కళ్ళలో ఇదమిత్థమనలేని ఆకర్షణ ఉంది. అయితేనేం ? అవిటిది!

కసిగా క్రిందిపెదవి కొరుక్కుంది కోమలి. మరుక్షణంలో తన ఆలోచనలకు తానే సిగ్గుపడింది. ఏ చెల్లెలిని గుండెలలో దాచుకొని

పెంచిందో, ఏ చెల్లెలు అవిటిదైనందుకు తను కుమిలిపోయేదో ఆ చెల్లెలి అవిటితనాన్ని తలచుకుని ఇప్పుడు సంతృప్తి పడుతూంది.

ఆలోచనలు భరించలేక కారుతీసి స్టార్టు చేసికొని వెళ్ళిపోయింది.

* * * *

"మీ అక్కయ్యకు నన్ను నేను అర్పణ చేసుకోగలను గానీ అమ్మడు పోలేను నీరజా!" అన్నాడు బాధగా రామకృష్ణ.

పొలంగట్ల వెంబడి రామకృష్ణకు ముందు నడుస్తున్న నీరజ వెనక్కు తిరిగి ఆశ్చర్యంగా అతనివంక చూసింది.

ఆమె మనసులో ఏదో అనుమానం కలిగింది. కానీ, దాన్ని గురించి ఆమె ఆలోచించ దలచుకోలేదు. అక్క అంటే నీరజకు పంచ ప్రాణాలూ. అందుకనే అట్లాంటి ఆలోచనలను భరించలేదు.

"అక్కయ్య చాలా మంచిది" అంది అతని మాటలకు సమాధానంగా. రామకృష్ణ విచిత్రమైన నవ్వుతో నీరజవంక చూసి, "నువ్వు చెప్పేదేదైనా నేను నమ్ముతాను" అన్నాడు.

నీరజ చాలా సిగ్గుపడింది. మనస్సంతా అనిర్వచనీయమైన ఒక భావానుభూతితో ఊగిపోయింది.

ఇంకోరోజున నీరజ 'బావగారూ' అని పిలిచి ఏదో చెప్పబోతూంటే రామకృష్ణ అడ్డుతగిలి, "బావగారూ అనకు. 'బావా!' అను" అన్నాడు. "ఏం?" అంది నీరజ ఆశ్చర్యంగా. అతను వచ్చిన దగ్గర్నుంచీ ఆమె అలానే పిలుస్తూ ఉంది. రామకృష్ణ తదేకంగా నీరజవంక చూస్తూ "ఈ పల్లెటూళ్ళో, ఈ పొలాల మధ్య పల్లెపడుచుల సౌందర్యా

నికి ప్రతినిధిలా ఉన్నావు నీరజా! నీ నోటితో 'బావా'అని నన్ను పిలిస్తే నా వ్యథలన్నీ మరిచిపోతాను" అన్నాడు. అతనిమాటలు నీరజకు అర్థమైనాయి. గుండె ఝల్లుమంది. భయం భయంగా అతనివంక చూస్తూ, "మా అక్కయ్య భర్తను నేనెప్పుడూ గౌరవిస్తాను" అంది.

"నేను మీ అక్క భర్తను కాను."

"ప్రస్తుతం కాకపోయినా అవుతారుగా?"

"ఏమో?!"

నీరజ ఆశ్చర్యంగా రామకృష్ణవంక చూసింది. అతని కళ్ళలో ప్రతిఫలించే దిగులు చూసి ఆమెకు తన పాత అనుమానాలు మళ్ళీ వచ్చాయి. కానీ, వాటినిగురించి రామకృష్ణనేమీ అడగలేదు.

కొంతసేపటికి రామకృష్ణ అకస్మాత్తుగా "నువ్వెవరినైనా ప్రేమించావా, నీరజా?" అన్నాడు.

నీరజ విరగబడి నవ్వింది. మళ్ళీ మళ్ళీ నవ్వుతూ, "నేనా! ప్రేమిద్దామనుకున్నాను గానీ ఎవ్వరూ దొరకలేదు బావగారూ! నాలాంటి అవిటివాడెవడైనా కనపడితే తప్పక ప్రేమిస్తాను" అంది. రామకృష్ణ నొచ్చుకుని, "ఎంతోమంది తమ మనస్సులోని అవిటితనాలను కప్పుకుని నిండైన మనుష్యుల్లా నటిస్తారు. కాస్త చెయ్యిలేకపోయినా నీలాంటి నిండైన మనిషిని నేనెక్కడా చూడలేదు" అన్నాడు.

నీరజ మౌనంగా తల వంచుకుంది.

రామకృష్ణ చాలాసేపు తటపటాయించి చివరకు, "నీరజా! నా హృదయమంతా ఆక్రమించుకొన్న నిన్ను ఎలా తోసివేయగలనో చెప్పు!" అన్నాడు.

నీరజ ఉలిక్కిపడింది. తలయెత్తి రామకృష్ణ వంక చూసింది. కాని, అతని చూపుల్లో చూపులు నిలపలేకపోయింది. ఆమె గుండె దడ దడలాడింది. కళ్ళనిండా నీళ్ళుకమ్మాయి. కాస్సేపటికి తలయెత్తి స్థిరంగా, "అంత తోసిపేయాల్సిన అవసరమేముంది బావగారూ! బావగారంటే తండ్రితో సమానం. తండ్రి మనస్సులో కూతురుపట్ల ఆమాత్రం వాత్స ల్యం సహజమే లెండి!" అంది.

ఆమె కళ్ళలో నీళ్ళు రామకృష్ణకు స్పష్టంగా కనిపించాయి. ఆమె మాటలు పచ్చి అబద్దాలనీ అతనికి తెలుసు. అయినా వాటికి తిరుగులేదని తెలుసు!

ఆరోజు వాళ్ళిద్దరూ ఇంటికి చేరేసరికి చాలా ఆలస్యమయింది. అంతకు చాలా సేపటిక్రిందటే ఇంటికి వచ్చిన కోమలి ఈర్ష్యతో ఉడికి పోతూంది. రాత్రి పదకొండు గంటలవరకూ సాగినవారి షికార్లు 'మామూలు' వని ఆమె అనుకోలేకపోయింది. దీనికితోడు వారిద్దరూ కూడా 'అదోలా' ఉండటం అగ్గిమీద గుగ్గిలం పోసినట్లయింది.

ఎవరి ఆలోచనలలో వారు ఉండటం వలన ఆరోజు భోజనాలు మౌనంగానే ముగిశాయి. ఆ మౌనం కోమలిని మరింత భయపెట్టింది.

ఆరాత్రి కోమలికి నిద్రపట్టలేదు. చాలాసేపు పక్కమీద అటూ ఇటూ దొర్లింది గుండెలు కుతకుత ఉడికిపోతున్నాయి. చివరకు విసిగి జ్యోతుల్లాంటి కళ్ళతో లేచి రామకృష్ణ దగ్గరకు వచ్చింది. నిద్రరాక చదువుకుంటున్న రామకృష్ణ కోమలిని చూసి పుస్తకం మూసేశాడు.

"ఏం శ్రద్ధ!" అంటూ నవ్వింది కోమలి.

రామకృష్ణ మాట్లాడలేదు. తనతో ఏదో చెప్పడానికే ఇంత రాత్రి వేళ కోమలి తనదగ్గరకు వచ్చిందని తెలుసు. ఆమె చెప్పేదానిని వినడా నికి సంసిద్ధుడై కూర్చున్నాడు.

కోమలి అతని కుర్చీప్రక్కనే ఉన్న బల్లమీద కూర్చుని పుస్తకంలో పేజీలు తిరగేస్తూ, ‘‘ఈ మట్టిలో షికార్లు వాకు నచ్చవు" అంది.

‘రంగంలోకి దిగుతూంది’ అనుకున్నాడు రామకృష్ణ.

‘‘నిన్ను రమ్మనలేదుగా!?" అన్నాడు.

ఈమాట కోమలికి గట్టిగా గుచ్చుకుంది. బాధతోనూ, రోషం తోనూ రామకృష్ణ కళ్ళలోకి చూసింది. వాటిల్లో ఉన్న వెటకారాన్ని భరించ లేకపోయింది.

‘‘నా సంగతి కాదు. మీ షికార్ల సంగతే! అసలే ఇది పల్లెటూరు. ఇట్లాంటివాటిని పల్లెప్రజలు తేలిగ్గా తీసుకోరు. అసలే అది అవిటిదని మతి తోచక చస్తూంటే, ఇలా షికార్లుగూడా చేస్తే దాని గతేంకాను? ఎంత గతిలేనివాడైనా దాన్ని చేసుకొంటాడా!" కోమలిచేత ఈమాట లనిపించింది చెల్లెలిమీద ఆపేక్షకాదు. రామకృష్ణకు నీరజ అవిటిదనే సంగతి గుర్తుచేయా లనే సంకల్పం. ఈ సంగతి అర్థం చేసికోలేనంతటి మూర్ఖుడు కాదు రామకృష్ణ.

వెటకారంగా నవ్వి అన్నాడు: "పాపం! ఎంత భయం! బెంగ పెట్టుకోవద్దులే! అంత పరిస్థితి విషమించినప్పుడు నీరజను నేనే చేసుకుం టాను."

అగ్నిపర్వతం బద్దలైంది. లావాద్రవం కోమలి కన్నులనుండి స్రవించింది.

‘‘నువ్వా, రామకృష్ణా! నువ్వు నీరజను చేసుకుంటావా? నాసంగతేం కావాలి? నన్నింత అన్యాయం చేస్తావా?"

కొంచెం దైన్యమూ, కాస్త రోషమూ, ఎక్కువ అధికారమూ తన గొంతులో రంగరించుకొని అరిచింది కోమలి.

ఆ అధికారం గుర్తించిన రామకృష్ణ మరింత పెంకెగా తయారయ్యాడు.

"నీకు అన్యాయమా? ఎవరైనా వింటే నవ్వుతారు కోమలీ! అవిటిదానవు కాదు. పసిడి బొమ్మలా అందంగా ఉంటావు. ధనవంతురాలివి. విద్యావతివి. నా తాతలాంటి వాళ్ళు నువ్వు 'ఊఁ' అంటే నీ కాళ్ళమీద పడతారు."

కోమలి సహించలేకపోయింది.

"ఉద్ధరించావు. నేను దానాలు చేసేంత ధనవంతురాలిని కాను. నావాళ్ళకి మాత్రమే నేను ఖర్చుపెట్టుకోగలను." కఠినంగా అంది.

రామకృష్ణ ముఖం మరింత గంభీరమయింది.

"నువ్వు ఎవరికీ దానం చెయ్యలేదు కోమలీ! అప్పిచ్చావు, ఉద్యోగం కాగానే తీర్చుకునే పద్ధతిమీద. మరిచిపోయావా? అయినా నువ్వు కోరితే ఈ క్షణంనుంచీ నీ అప్పు తీర్చడానికి ప్రయత్నిస్తాను."

కోమలి ఆ గదిలోంచి పారిపోయింది.

ఆ రాత్రంతా ఆమె మెదడు అగ్నిగోళంలా ఉడికింది.

ఉదయం ఎర్రబారిన కళ్ళతో తూలుతూ నడుస్తున్న కోమలినిచూసి నీరజ కంగారుపడింది. కోమలి దగ్గరగా వచ్చి ఆమె చెయ్యి పట్టుకొని, ఏం జరిగింది అక్కయ్యా!" అంది.

"ఏం లేదు. రాత్రంతా బెంగతో నిద్రలేదు." పరధ్యానంగా అంది కోమలి.

"బెంగా?" ఆశ్చర్యంగా చూసింది నీరజ.

కోమలి మనస్సు ఉడికింది.

"అవును! బెంగ! రామకృష్ణ నన్నిప్పుడే పెళ్ళి చేసుకోమంటున్నాడు. చదువు పూర్తయ్యేవరకూ ఆగలేడట. మేమిద్దరం వెళ్ళిపోతే నీ సంగతేమిటి!—అని."

కసిగా చూసింది నీరజ వంక.

నీరజ తేలిగ్గా నవ్వేసింది. "ఓస్! ఇదేనా? నాకేమవుతుందీ?" లోకంలో మంచివాళ్ళు చాలామంది ఉన్నారు. నాకు బాగానే గడుస్తుంది అక్కయ్యా!" నవ్వుతూనే అక్కడినుంచి వెళ్ళిపోయింది.

కోమలి పళ్ళు పటపట నూరింది.

చేతిలో కాఫీకప్పు విసురుగా బల్లకేసి కొట్టి అక్కడినుంచి లేచి పోయింది.

ఏది ఎలావున్నా కోమలి రామకృష్ణను మనసారా ఆరాధిస్తూంది. అతడు తనవాడు కాకపోవటం ఆమె భరించలేదు.

ఆ రోజుకూడా నీరజ రామకృష్ణలు మామూలుగా పొలాలకేసి బయలుదేరడం చూసిన కోమలి నిలువెల్లా దహించుకొని పోయింది. ఆమెలో యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం నశించింది. వాళ్ళు అలా వెళ్ళగానే తన కారు 'స్టార్టు' చేసింది కోమలి.

ఆ రోజు రాత్రి నీరజ పడుకోబోయేముందు తాను స్వయంగా పాలు అందించింది కోమలి. తమ చిన్నతనంలో రోజూ కోమలి

ఇలానే చేసేది. తాను త్రాగనని మొండిచేస్తే బ్రతిమాలి, బెదిరించి త్రాగేవరకూ కదిలేదికాదు. ఆ రోజులన్నీ గుర్తుకొచ్చి నీరజ మనసులో అక్కయ్యమీద అభిమానం వెల్లువలా పొంగింది. ఆమె చేతిలోని గ్లాసు తీసుకొని అప్యాయంగా పాలు త్రాగింది తరువాత మంచంమీద పడుకొని ఆపేక్షగా అక్కయ్య ముఖంలోకి చూచింది. ఆ ముఖం చూచి హడలిపోయింది నీరజ. "అదేమి టక్కయ్యా! అలా వున్నావు?" అంది.

"ఏం లేదు" అంది కోమలి వణుకుతూన్న కంఠంతో.

"అరే! వణుకుతున్నావు కూడాను!" అంటూ దగ్గరకువచ్చి నుదుటిమీద చెయ్యివేసింది నీరజ. వేడిగా తగిలింది, "జ్వరం వచ్చినట్లుగా ఉంది అక్కయ్యా! వెర్రి పిచ్చి అక్కయ్యవు. నీ ఆరోగ్యం సంగతి కూడా నీకు తెలియదు," ఆపేక్షగా అంది—"పద! నీ గదిలోకిపోయి పడుకుందువుగాని'' అని చేయిపట్టుకుని నడిపించింది నీరజ. కోమలి యాంత్రికంగా నడిచింది. అక్కను పక్కమీద పడుకోబెట్టి, రగ్గుకప్పి, "వెడుతున్నా అక్కయ్యా పోనీ, నన్ను ఇక్కడే పడుకో మంటావా?" అని జాలిగా అడిగింది నీరజ.

"వద్దు!" కఠినంగా అంది కోమలి.

ఆ కంఠస్వరానికి చకితురాలై తనగదికి వచ్చేసింది నీరజ. ఆ రాత్రి కోమలికి చాలా కలలు వచ్చాయి

తాను శవాలు పరీక్షచేస్తూంది. బోలెడన్ని శవాలు బల్లలనిండా పడి ఉన్నాయి. అందులో ఒక శవం తను కోస్తూంది. దానికి ఒక చెయ్యిలేదు. ఆ శవం కళ్ళు గర్వంగా నవ్వాయి. పెదవులు వెక్కిరించాయి.

ఉలికిపడి లేచి కూర్చుంది కోమలి. చెమటతో శరీరమంతా తడిసిపోయింది.

ఉదయం తన గది బయట గందరగోళం వినిపిస్తూన్నా లేవలేదు కోమలి. చివరకు పనిమనుష్యులు, రామకృష్ణ గది తలుపులు పగల గొట్టేంత పనిచేస్తే లేచి తలుపు తీసింది.

ఆమెనుచూసి అందరూ విస్తుపోయారు. ఎదో చెపుదామని తెరిచిన వాళ్ళనోళ్ళు తెరిచినట్లే ఉన్నాయి

కోమలి ఎవరినీ ఏమీ అడగలేదు. తిన్నగా చెల్లెలి గదిలోకి వెళ్ళింది. పక్కమీద జీవంలేకుండా ఉన్న తన చెల్లెలిమీద, పసితనం నుంచీ తాను అల్లారుముద్దుగా చూసుకున్న చెల్లెలిమీద, తనను ప్రాణంగా ప్రేమించే చెల్లెలిమీద పడిపోయింది.

అందరినీ బయటకు పొమ్మని సంజ్ఞచేసి రామకృష్ణ కోమలి దగ్గరగా వచ్చాడు. కోమలి పిచ్చిగా, భయంగా అతనివంక చూసింది. ఆమె కళ్ళలో నీటిబొట్లు లేవు. అవి ఈ లోకంలో లేవు. కోమలిని చెయ్యిపట్టుకొని ఇవతలకు ఇంచుమించు లాక్కొని వచ్చాడు రామకృష్ణ.

* * * *

కాలగర్భంలో నాలుగు నెలలు కలిసి పోయాయి. నీరజ మృతిని అందరూ మరిచిపోయారు, కోమలీ రామకృష్ణలు తప్ప. కోమలి మళ్ళీ కాలేజికి వెళ్ళలేదు. రామకృష్ణమాత్రం వెళ్ళిపోయాడు. ఎప్పుడైనా ఒక ఉత్తరం వ్రాస్తాడు చాలాపొడిగా. కోమలి చదివి ఊరుకుంటుంది. సమాధానం ఇయ్యదు.

ఎక్కడెక్కడో తిరిగి నీరజను తలచుకుంటూ తన గదికి చేరుకున్న రామకృష్ణకు అరుగుమీద ఎవరో కూర్చుని ఉండటం, అందులో ఆ కూర్చున్నవ్యక్తి స్త్రీ కావటం చాలా ఆశ్చర్యం కలిగించింది.

"ఎవరూ?" అన్నాడు చిరాగ్గా.

"నేను!'' రామకృష్ణ కోమలి కంఠాన్ని తేలిగ్గా గుర్తించాడు. అంతులేని ఆశ్చర్యంతో దగ్గరగావచ్చి చూశాడు. నాలుగు నెలల క్రిందటి కోమలికీ. ఈ వ్యక్తికీ ఎంతో తేడా ఉన్నా ఈ వ్యక్తి కోమలే! నల్లని వలయాలను ఏర్పరచుకున్న కళ్ళూ, దిగులుగా తిరిగే కనుపాపలూ, కళ తప్పిన ముఖ వర్చస్సూ, నీరసించిన శరీరమూ, నలిగి ఏదో యధాలాపలగా కట్టుకున్న సామాన్యమైన చీరా, కోమలిని చూచి రామకృష్ణ దిగ్భ్రాంతు డయ్యాడు. నీరజమీద కోమలి కింత అభిమానమని అతనికి తెలియదు. సానుభూతితో కోమలి చెయ్యిపుచ్చుకొని లోపలికి తీసుకెళ్ళాడు. లోపలకు వచ్చీ రాగానే రామకృష్ణ కాళ్ళమీదపడి భోరున ఏడ్చింది కోమలి. రామకృష్ణ లేవదీయబోయాడు. కానీ కోమలి వదల్లేదు.

"నన్ను ఏడవనియ్యి రామకృష్ణా! మనసారా కాస్సేపు ఏడవనియ్యి. నా గుండెలు బద్దలవుతున్నాయి. మృత్యువు ఇంత భయంకరమైనదని నాకు తెలియదు" అంది.

రామకృష్ణ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కోమలి వ్యథను చూస్తూంటే తాను కోమలిని తప్పుగా అర్థం చేసుకున్నాననిపించింది. ఓదార్పుగా ఆమె తల నిమురుతూ, "గుండెజబ్బు ఉన్నవాళ్ళు ఇవాళ కాకపోతే రేపైనా ఇలా చావవలసినదే కదా! ఈ వెలితి పూడ్చలేనిదే. ఐనా, ధైర్యం తెచ్చుకోక చెయ్యగలిగిందేముందీ!" అన్నాడు. కోమలికి, రామకృష్ణ మాటలు

పూర్తిగా వినపడలేదు. "నీరజకు గుండెజబ్బా? ఎవరు చెప్పారు?" తెల్లబోతూ అడిగింది.

"నీరజే చెప్పింది."

కోమలికి నోటమాట రాక రామకృష్ణ మొహంలోకి చూస్తూ ఉండిపోయింది.

"అవును కోమలీ! నీరజేచెప్పింది ఆరోజు. రాత్రి—అంటే తాను చనిపోబోయే రాత్రి—ఇంచుమించు పన్నెండు గంటలకు నాదగ్గరకు వచ్చి నిద్రపోతూన్న నన్ను లేపింది. నేను చాలా ఆశ్చర్యపోయాను. అప్పుడే చెప్పింది — తనకు గుండెజబ్బు ఉందనీ, అప్పుడప్పుడూ గుండెల్లో నొప్పి విపరీతంగా వస్తూందనీ, ఆరోజుకూడా అలాగే వచ్చిందనీ చెప్పింది.

'నే నింక బ్రతకననిపిస్తూంది బావగారూ! చివరిసారిగా మిమ్మల్ని చూద్దామని వచ్చాను' అంది కన్నీళ్ళతో.

నేను పరీక్షచేయబోయాను. వద్దని కఠినంగా వారించింది. అప్పటికే ఆమె చాలా అవస్థపడుతూంది.

'చచ్చిపోతూ నేనొకటి అడుగుతాను. నామాట నిలపెట్టుతారా?' అంది.

ఆమె అవస్థచూచి, 'తప్పక, నీకోసం నేనేమైనా చేస్తాను'అన్నాను. 'అక్కయ్యను తప్పక పెళ్ళిచేసుకోండి. అది మిమ్మల్ని దేవతలాగా ఆరాధిస్తోంది. ఏ పరిస్థితిలోనూ మనస్సు మార్చుకోకండి. ఇదే నేను కోరేది' అని ఆయాసంతో కాస్సేపాగింది. నేనామెచేతిని నాచేతిలోకి తీసుకున్నాను—పరీక్షించే ఉద్దేశ్యంతో. నాచేతిని గట్టిగా పట్టుకొని క్షణకాలం

తన గుండెలమీద అన్చుకొని మళ్ళీ 'అక్కయ్య ఇచ్చిన పాలు అస్వస్థతలో ఉన్న నానాలుకకు చిరుచేదుగా ఉన్నా మనస్సుకు మాత్రం అమృతంలా గున్నాయి. ఈ సంగతి ఎప్పుడైనా అక్కయ్యతో మరిచిపోకుండా చెప్పండి'—అని నాకు మాట్లాడేందుకు అవకాశమియ్యకుండా తనగది లోకి వెళ్ళిపోయింది. నేనామెను వెంబడించాను. కానీ అప్పటికే ఆమె గది తలుపులు లోపల వేసేసుకుంది. నిన్ను లేపుదామని నీ గదితలుపు తట్టాను. నువ్వు పలుకలేదు. తెల్లవారాక చూచుకోవచ్చనుకున్నాను. కానీ తెల్లవారేసరికి అంతా తెల్లవారిపోయింది. నీకూ, నాకూ మధ్య నీరజ ప్రసక్తి రాకపోవటం వల్ల ఇన్నాళ్ళూ ఈసంగతి చెప్పలేదు" అన్నాడు రామకృష్ణ కళ్ళుతుడుచుకుంటూ.

అతనిమాటలలోని ప్రతిఅక్షరమూ కోమలి మెదడులో వెయ్యిసార్లు ప్రతిధ్వనించింది. లెక్కలేని నగ్న సత్యాలు పిశాచాలలాగు ఆమెచుట్టూ నృత్యంచేశాయి. 'నీరజకు తన చావుకు కారణం తెలుసు!'

'తెలిసే తనను క్షమించినట్లు సందేశం పంపింది.'

'చనిపోతూ కూడా తన సుఖంకోరి రామకృష్ణ దగ్గర వాగ్దానం తీసుకుంది.'

'తన మరణం గురించి ఎవరికీ అనుమానం కలుగకుండా మరణావస్థలో ఉండీ గుండెజబ్బు కథ కల్పించింది.' కోమలి విరుచుకుని పడి పోయింది. రామకృష్ణ కంగారుగా ఆమెకు స్పృహ తెప్పించడానికి ప్రయత్నించాడు. కొంత సేపు శ్రమపడిన తర్వాత కోమలి కళ్ళు తెరిచింది.

రామకృష్ణ చేతులు రెండూ గట్టిగా పట్టుకొని, "దయచేసి నన్ను హత్యచెయ్యవూ?" అని అడిగింది—ఎంతో జాలిగా, దీనాతిదీనంగా.

(15)

రామకృష్ణ బిత్తరపోయాడు.

"చెయ్యవూ ? అయితే ఇంకెవరినైనా అడుగుతాలే!" అని వీధి లోకి పరుగెట్టింది కోమలి—ఆమెను వారించడం రామకృష్ణ తరంకాలేదు.

ఇప్పటికీ కోమలి వీధులవెంట తిరుగుతూ ఉంటుంది—కనుపించిన ప్రతివాడినీ, "దయచేసి నన్ను హత్య చెయ్యవూ?" అని జాలిగా ప్రతిమాలుతుంది. ఈ మాటలు ఎవరికీ అర్థం కావు. బహుశా పైలోకంలో ఉన్న నీరజ ఈ మాటలు విని జాలిగా నవ్వుకుని ఉంటుంది.